భగత్‌సింగ్‌కు ఘన నివాళి



హైదర్షాకోట్‌లో జరిగిన వర్ధంతిలో పాల్గొన్న సీపీఎం నాయకులు

శంషాబాద్: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 93 వర్ధంతిని ఎస్ఎస్‌యూఐ నాయకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఆనంద్ మాట్లాడుతూ.. భగత్ సింగ్ ఉద్యమ స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని సూచించారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మణికంఠ, జగదీశ్, ఈశ్వర్, అభిషేక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చౌరస్తా వద్ద..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్ సీపీఎం బి.బాల్‌రాజ్ అధ్యక్షతన కేంద్ర విహార్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు డి.జగదీశ్ హాజరై వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా 23 ఏళ్ల వయస్సులోనే ఉరికంబాన్ని ముద్దాడిన నాయకుడు భగత్‌సింగ్ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో గండిపేట మండల పార్టీ కన్వీనర్ జాజాల రుద్రకుమార్, సీఐటీయూ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, బలరాం, జి.వెంకటేశ్, శ్రీనివాస్, వెంకట్, ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, వినోద్, నరసింహ, రవినాయక్, శ్యామ్, నరేశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నవయువ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో..

మైలార్‌దేవ్‌పల్లి: నవయువ యూత్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులతో కలిసి యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమార స్వామి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, గౌంత్యాల శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, శోభ, సునీత,



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఎస్ఎస్‌యూఐ నాయకులు

సాయి, మంగాదేవ్ పాల్గొన్నారు.

సీపీఎం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో..

రాజేంద్రనగర్: సీపీఎం పార్టీ అనుబంధ సంఘాలు డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వెంకటేశ్వర కాలనీ బుద్వేల్ రైల్వేస్టేషన్ వద్ద భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకట స్వామి, ఎం.బాలస్వామి, బి.రాఘవేంద్ర, జి.చైతన్య, మౌలాలి, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.



అంగన్‌వాడీకేంద్రంలో భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూత్ క్లబ్ సభ్యులు

యథేచ్ఛగా బోర్లు

- రోడ్లపక్కన, ఫుట్‌పాత్‌లపైనే వేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు



ఫుట్‌పాత్‌పై బోరు వేస్తున్న ఓ అపార్ట్‌మెంట్ వాసులు

మణికొండ: ఇంటి ఆవరణలో వేయాల్సిన బోర్లు ఏకంగా ఫుట్‌పాత్‌లు, రోడ్లపైనే వేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి కావడంతో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అనేక అపార్ట్‌మెంట్లు, గృహాల్లోని బోర్లు వట్టిపోయాయి. జలమండలి వారు సరఫరా చేస్తున్న నీరు ఏమాత్రం సరిపోకపోవడం, గృహాలు, అపార్ట్‌మెంట్లలో బోర్లు వేసే పరిస్థితి లేకపోవడంతో రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపైనే వేస్తున్నారు. నిబంధనల ప్రకారం కొత్తగా బోరు వేయాలంటే దానికి 100 మీటర్ల దూరం వరకు ఎలాంటి బోరు ఉండొద్దు. అలా ఉంటే వారి నుంచి నిరభ్యంతర పత్రం, భూగర్భజల శాఖ వారు అక్కడ నీరు పడుతుందని ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో రెవెన్యూ అధికారులకు బోరు వేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వారు అన్ని పరిశీలించి సరైన స్థలం ఉంటే అనుమతులు జారీ చేస్తారు. అయితే అలాంటి తతంగాలు ఏమీలేకుండానే ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు ఎక్కడ పడితే అక్కడ బోర్లు వేస్తున్నా పట్టించుకునే నాథుడే లేరని మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని తవారు కోరుతున్నారు.


‘దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్న బీజేపీ’


బండ్లగూడ: స్వేచ్ఛగా పని చేసే సీబీఐ, ఈడీ, ఐటీలను బీజేపీ ప్రభుత్వం తమ జేబు సంస్థలుగా వాడుకుంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో గండిపేట మండల పట్టణంలోని అప్పా చౌరస్తాలో శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తమాట్లాడుతూ బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చట్టాల ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని, బీజేపీయేతర రాష్ట్రాల్లో మాత్రం కక్ష పూరితంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, తెలంగాణ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయించారని మండిపడ్డారు. మరోవైపు కాంగ్రెస్ బ్యాంకు అకౌంట్లను సీజ్ చేసి ఎన్నికల్లో దెబ్బతీయాలని చూస్తుందని పేర్కొన్నారు. పార్టీ వేసిన పిటిషన్‌తోనే సుప్రీం ఆదేశాల మేరకు ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలు బయటకు వచ్చాయని గుర్తు చేశారు. ఇండియా కూటమిని బలహీనం చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని, దీనికి వ్యతిరేకంగా ప్రజలందరూ ఆలోచించి బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గండిపేట మండల పార్టీ కన్వీనర్ జాజాల రుద్రకుమార్, ప్రవీణ్‌కుమార్, అనిల్, సునీల్, చారి, రవి, రాజుగౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



అప్పా చౌరస్తా వద్ద నిరసనలో పాల్గొన్న సీపీఎం నాయకులు

హోలీకి ప్రత్యేక దుకాణాల ఏర్పాటు





రాజేంద్రనగర్: హోలీ పండుగను పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేశారు. వివిధ రకాల రంగులతో పాటు పిచికారీలు, వాటర్ బబుల్స్, వాటర్ గన్స్, వాటర్ ప్రెషర్ గన్స్‌తో పాటు చిన్న పిల్లలకు అనువుగా ఉండే రంగుల గన్‌లను విక్రయిస్తున్నారు. రాజేంద్రనగర్, బుద్వేల్, శివరాంపల్లి, ఆరాంఘర్, ఎర్రబోడ, అత్తాపూర్, హైదర్‌గూడతో పాటు ప్రధాన రహదారులపై ఈ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. హోలీ అనంతరం చిన్న పిల్లలకు వేసే మిఠాయి పేర్లు, కొబ్బరి కూడకలతో కూడిన దండలను ప్రత్యేకంగా విక్రయిస్తున్నారు.

మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులు
- మల్కారం గ్రామంలో అవగాహన



డ్వాక్రా సంఘం మహిళలతో ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులు

ఏజీవర్సిటీ: డ్వాక్రా సంఘాల మహిళలు వ్యాపారాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, విద్యార్థులు పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా శంషాబాద్ మండల పరిధిలోని మల్కారం గ్రామంలోని డ్వాక్రా సంఘం మహిళలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘాల సభ్యులకు పండ్లు, కూరగాయలతో ఇంట్లోనే తక్కువ ఖర్చుతో చేసుకునే బలవర్ధకమైన నిల్వ జామ్, వేసవిలో పిల్లలకు చలవదనం కోసం విరివిగా ఉపయోగపడే పుచ్చకాయ రసం, సోంపు కలకండ రసం ద్రవపదార్థాల తయారీ విధానాన్ని వివరించారు. అదే విధంగా చర్మ సంరక్షణ కోసం ఉపయోగించే సబ్బుల తయారీ విధానాన్ని కలబంద, పసుపు, వేప వంటి సహజ పదార్థాలతో ఎలాంటి రసాయన పదార్థాలు ఉపయోగించకుండా తక్కువ ఖర్చుతో ఇంట్లోనే సహజ పద్ధతులతో సబ్బుల తయారీ విధానాన్ని డ్వాక్రా బృందం సభ్యులకు విద్యార్థులు వివరించారు. అలాగే కూరగాయలు, పూలు, పండ్ల నర్సరీ మొక్కల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముఖ్యంగా పండ్ల మొక్కల్లో అంటుకట్టే పద్ధతి వాటి ఉపయోగాలను రైతులకు వివరించారు. ఇంటిదగ్గర ఉన్న ఖాళీ స్థలంలో ఆకుకూరలు, కూరగాయల మొక్కలతో కిచెన్ గార్డెన్ తయారు చేసుకొని ఇంటికి అవసరమైన సేంద్రియ ఆకుకూరలు, కూరగాయలను పండించుకోవచ్చని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జి సంతోషిని మాట్లాడుతూ మహిళలు గ్రూపులుగా ఏర్పడి తక్కువ ఖర్చుతో సబ్బులు, కొవ్వొత్తులు, కూరగాయలు, పండ్లరసాలను తయారు చేసి స్వయ సమృద్ధి పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో లావణ్య, అశ్వన్ కుమార్, శ్రీరాములు, డ్వాక్రా సంఘం సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



జామ్ తయారీ విధానాన్ని చేసి చూపిస్తున్న విద్యార్థులు

తై బజార్ వేలం రద్దు చేయాలి



తై బజార్ వేలం రద్దు చేయాలని వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

శంషాబాద్: తై బజార్ వేలాన్ని రద్దు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చిన బీజేపీ పట్టణాధ్యక్షుడు దేవేందర్, కిసాన్ మోర్చా మహిపాల్‌రెడ్డి తదితరులు అక్కడ తై బజార్ వేలం కొనసాగుతుండడంతో అధికారులను ప్రశ్నించారు. పట్టణంలో ఎలాంటి ప్రకటనలు లేకుండా టామ్ టామ్ వేయకుండా గతంలో ఉన్న వారినే పిలిచి తై బజార్ వేలం వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అంతే గాకుండా గతేడాదికన్నా రూ.2 లక్షలకు తక్కువగా కాంట్రాక్టు ఎలా ఇస్తారని నిలదీశారు. దీనిపై తాము న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. అధికారులు వెంటనే వేలంను రద్దుచేసి మరోసారి నిర్వహించాలని కోరారు. నాయకులు జగ్జీవన్‌రెడ్డి, చల్లా శ్రీను, అశోక్, నాని, జ్ఞానేశ్వర్, రమేశ్‌త తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేత ‘సీబీఐటీ’



విజేతగా నిలిచిన సీబీఐటీ జట్టుతో ప్రిన్సిపాల్, టోర్నమెంట్ నిర్వాహకులు

మణికొండ: ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాయి ఇంటర్ కళాశాలల బ్యాడ్మింటన్ పురుషుల విభాగం పోటీల్లో చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాల విజేతగా నిలిచింది. గండిపేటలోని కళాశాలలో శనివారం జరిగిన ఫైనల్స్‌లో ఎంవీఎస్ఆర్ కళాశాల జట్టుపై 2–1 స్కోరుతో గెలుపొందింది. కార్యక్రమంలో పాల్గొన్న ఓయూ టోర్నమెంట్ కార్యదర్శి డాక్టర్ కె. కృష్ణ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆర్. రాజేశ్వరి, కోచ్‌లు 11 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఎయిర్‌పోర్టులోని డెక్లాథన్‌లో రాష్ట్ర స్థాయి అండర్–16 రోల్‌బాల్ క్రీడా పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కోచ్‌లు సయ్యద్ అసన్ అహ్మద్, ఇంతియాజ్, షఫీ, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, మండలాధ్యక్షుడు కె. చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

రహదారి పునరుద్ధరణపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్‌కాలనీ అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: బైరాగిగూడ– నార్సింగి రోడ్డు మార్గం పునరుద్ధరించడంపై ఆల్‌కాలనీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. బైరాగిగూడలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గంధంగూడ, బైరాగిగూడ, పీరంచెరువు, హైదర్షాకోట్ తదితర గ్రామాల నుంచి నార్సింగి వెళ్లే రహదారిని అకస్మాత్తుగా ఓ స్థిరాస్తి సంస్థకు చెందిన వారు ఇటీవల రేకుల షెడ్డు వేసి మూసివేయడంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. దీంతో తాము ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా 24 గంటల్లోనే చర్యలు చేపట్టి పునరుద్ధరించడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, నార్సింగి కమిషనర్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ నాగపూర్ణ శ్రీనివాస్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో రూ. 50 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి సైతం తీర్మానం చేశారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఎన్నికల తర్వాత బీటీ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆల్‌కాలనీ అసోసియేషన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, రమేశ్, నాగార్జున, మహేశ్ కుమార్, బోగాల శ్రీనివాస్, తలారి ప్రేమ్‌కుమార్, రాజశేఖర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న వెంకటేశ్వరకాలనీ వాసులు

పార్కులను పరిరక్షించాలి



కాలనీలోని పార్కుల వివరాలు వెల్లడిస్తున్న అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడి

మణికొండ: హెచ్ఎండీఏ లేఅవుట్‌గా చూపి తమకు ప్లాట్లు విక్రయించారని ఇపుడు పంచాయతీ లేఅవుట్ అని కాలనీలోని పార్కులను అన్యాక్రాంతం చేస్తున్నారని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీ వాసులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అ.ధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ కాలనీ గతంలో హెచ్ఎండీఏకు లేఅవుట్‌కు దరఖాస్తు చేస్తే అనుమతులు రాకపోవడంతో గ్రామపంచాయతీకి మార్చారన్నారు. వాటిల్లో ఐదు చోట్ల పార్కులు చూపి ప్రస్తుతం ఒకటి కూడా లేకుండా చేస్తున్నారన్నారు. కాలనీలో తమ బోర్లు వట్టిపోయి తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నా జలమండలి అధికారులు నీటిని సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. ప్రైవేట్ ట్యాంకర్ల వారు ఇష్టారాజ్యంగా డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. కాలనీలోని ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందని, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేకుంటే రాబోయే ఎంపీ ఎన్నికల్లో ఓటు వేయమని స్పష్టం చేశారు. స్థానిక కౌన్సిలర్ పద్మారావుతో పాటు చుట్టు పక్కల కాలనీల వాసులు ఆందోళనకు మద్దతు తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో బ్రాంజ్ మెడల్స్

బండ్లగూడ: ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్–2024లో తెలంగాణ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్ డైరెక్టర్ (అడిషనల్ ఎస్పీ)గా పని చేస్తున్న గంటా వెంకట్రావు రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష ఆయనను అభినందించారు. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన అండర్ 55 విభాగంలో ఆయన పాల్గొని మెడల్స్ గెలుపొందారు. 1991 బ్యాచ్ ఎస్సైగా రిక్రూట్ అయి బెస్ట్ ఆఫీసర్‌గా గుర్తింపు పొంది పలు కేంద్ర, రాష్ట్ర పతకాలు సాధించారని పేర్కొన్నారు. ఖమ్మం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా, రాష్ట్ర బ్యాడ్మింటన్ సెక్రటరీగా సేవలు అందిస్తూ, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్వెస్టిగేషన్‌లో కూడా ఎన్నో మెడల్స్ సాధించారన్నారు. 2017లో జరిగిన ఛాంపియన్‌షిప్‌లోనూ గోల్డ్ మెడల్ పొందారు.

ఉత్సాహంగా సెయింట్ ఆన్స్ కళాశాల అలూమ్నీ మీట్



గోల్కొండ: కళాశాల పూర్వ విద్యార్థులు తమ ప్రతిభతో తాము చదివిన కళాశాలకు గర్వంగా మారుతారని మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ విజయరాణి అన్నారు. శనివారం కళాశాలలో ఎన్యూవల్ అలూమ్నీ అనొరీ–2024 వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఈ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దూరప్రాంతాల నుంచి సైతం తరలివచ్చారు. కళాశాల అలూమ్నీ ప్రొఫెసర్ డాక్టర్ సుధ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ కళాశాల పూర్వ విద్యార్థినులు ఉస్మానియా యూనివర్సిటీలో పాటు ఇతర ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో కీలక పదవుల్లో ఉన్నారన్నారు. వారంతా అలూమ్నీ వేడుకల్లో పాల్గొనడానికి ఎంతో ఉత్సాహంతో రావడం ప్రస్తుత విద్యార్థినులకు ప్రేరణగా నిలుస్తున్నారని ఆమె అన్నారు. వర్ధమాన నటుడు అమర్‌దీప్‌చౌదరి, కరస్పాండెంట్ దయాకుమారి, సెక్రటరీ ఆఫ్ అలూమ్నీ అసోసియేషన్ డాక్టర్ టి.అనురాధా, కన్వీనర్ ఇందిరాప్రియదర్శిని, అలుమ్నీ ప్రతినిధులు డాక్టర్ స్వాతిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన తేనెటీగల పెంపకం శిక్షణ



ఏజీవర్సిటీ: కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న తేనెటీగల పెంపకం శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. చివరిరోజు విశ్వవిద్యాలయం వీసీ నిరజాప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. అధిక ఫలసాయం, అధిక ఆదాయం కోసం శాస్త్రీయ తేనెటీగల పెంపకం చేపట్టాలన్నారు. తేనెటీగల పెంపకం చేసే రైతులకు జాతీయ తేనెటీగల పెంపకం, తేనె మిషన్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో దక్షణ పరిశోధన, దక్షణ తెలంగాణ వాతావరణ మండల అధిపతి టీ సురేశ్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనితాకుమారి, డాక్టర్ ప్రితమ, డాక్టర్ నిఖిల్, డాక్టర్ భ్యాగశాలి, కూరగాయల పరిశోధనా సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డికి సన్మానం



రాజేంద్రనగర్: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎంపీ రంజిత్ రెడ్డిని రాజేంద్రనగర్ డివిజన్ సులేమాన్ నగర్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా భారీ గజమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఇషాక్ ఉద్దీన్, వాజీద్‌ఖాన్, సాజీద్ ఖాన్, షేక్ యూసుఫ్, మహ్మద్ ఖాన్, మహ్మద్ జాఫర్, ఖైసర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి..



రాజేంద్రనగర్: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియామకమైన వడ్డెపల్లి రాంచందర్‌ను తన కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంట్ ఎస్సీ కన్వీనర్ జోగి రవి శనివారం కలిశారు. ఈ సందర్భంగా పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జోగి రవి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎస్సీల సమస్యలను రాష్ట్ర., కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆదర్ల మహేశ్, ఎం.విఠల్ రావు, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌కు..

రాజేంద్రనగర్: రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను రాజేంద్రనగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు దాస్, జనార్దన్, పెండ్యాల శ్రీధర్ తదితరులు శనివారం కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలో పని చేసే ప్రతిఒక్కరికీ తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. ఇందుకు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చైర్మన్‌గా నియమించడమే ఉదాహరణ అని తెలిపారు.

వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు



ఆంజనేయులుకు నియామక పత్రం అందజేస్తున్న వెంకటేశ్

అత్తాపూర్: రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడిగా హిమాయత్‌సాగర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆంజనేయులు నియామకమయ్యాడు. అత్తాపూర్‌లోని సంఘం భవనంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేశ్ ఆయనకు నియామక పత్రాతన్ని అందజేశారు.తీ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కులస్తులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కె. నరేందర్‌ముదిరాజ్, నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న విశ్వేశ్వర్‌రెడ్డి దంపతులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ అలకాపూర్ టౌన్‌షిప్‌లోని రామాలయంలో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డితో కలిసి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా దశాబ్దాల తర్వాత అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట జరగడంతో దేశానికి మంచి జరుగుతుందన్నారు. అదే తరహాలో చేవెళ్లలోనూ రామరాజ్యం తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులనే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని ఆయన సూచించారు.